క్లుప్తంగా

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ఆర్డీఓ మొవిడి వాణి



నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని ఆర్డీఓ మొవిడి వాణి అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఇచ్చే అర్జీలను సంబంధిత అధికారులకు పంపిస్తామని, వాటిని జాప్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మీ కోసంలో 5 అర్జీలు రాగా సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్వై నూరాని, డీఎల్‌డీఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

నూజివీడు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. బీమా నిమిత్తం పాలసీలను ప్రజలు కొంటున్నారని, వీటిపై పన్ను విధించడం దారుణమని చెప్పారు. పాలసీలపై జీఎస్టీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచాలని, అన్ని పాలసీలపై ఏజెంట్ల కమీషన్‌ను పెంచాలని కోరారు. ఏజెంట్ల సంఘం నాయకులు లాజరస్, మలిశెట్టి శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాసరావు, మానూరి ప్రసాద్, టీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న చెరువు కట్టలు



చాట్రాయి: చెరువు కట్టలపై ముళ్ల పొదలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో సుమారు 108 చెరువులు ఉన్నాయి. చాలా వరకు చెరువు కట్టలకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగి వాటి కొమ్మలు రోడ్డుపైకి వ్యాపించాయి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఎదురుగా వస్తున్న వారు తప్పుకోవాలంటే చెట్ల కొమ్మల వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ముళ్ల చెట్ల కొమ్మలు తలకు తగలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు చెరువు కట్టలపై ఉన్న ముళ్ల చెట్ల కొమ్మలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థినుల ఎంపిక

నూజివీడు: గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పొట్లూరి రాధికారాణి మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నున్న జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-17 బాలికల సెలెక్షన్స్‌లో 9వ తరగతికి చెందిన మేఘన ఫాయిల్ విభాగంలో, ఈర్ల జయశ్రీ అనూష సాబర్ విభాగంలో ఎంపికయ్యారని చెప్పారు. వీరు నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 20న నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం, పీడీ రవీంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే

ఆగిరిపల్లి: చేతులు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని ఏపీఎం దయాల రాజశేఖర్ అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అనారోగ్యానికి గురికాకుండా ఉండడానికి వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ మీనాక్షి, వీఓఏలు, సీసీలు, మహిళా స్వయం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎ.కొండూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సీపీఎం నాయకురాలు శ్రీదేవి అన్నారు. సీపీఎం చీమలపాడు గ్రామ శాఖ మహాసభ మంగళవారం చీమలపాడులో జరిగింది. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని విమర్శించారు. ధరల నియంత్రణకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు పి. ఆనందరావు, ఎం. స్వరాజ్యం, ఎలిజిబెత్ రాణి పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ముసునూరు: ముసునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

శునకాలు, వానరాలతో బెంబేలు

- గ్రామాల్లో కుక్కలు, కోతుల స్వైర విహారం
- నిత్యం కుక్కలు, కోతుల దాడులతో గాయాలపాలవుతున్న ప్రజలు
- వీధుల్లోకి రావాలంటే భయపడుతున్న పిల్లలు
- రాత్రిళ్లు వాహనాలను వెంబడిస్తున్న కుక్కలు



వెలగలేరులో గుంపుగా ఉన్న వీధి కుక్కలు



వెల్లటూరు శివారులో కోతుల మంద

జి.కొండూరు: వీధి కుక్కలు, కోతులు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. రహదారులపై గుంపులుగా ఒకచోట చేరి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. నిత్యం కుక్కలు, కోతుల దాడులతో గాయాలపాలైన ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. మూగ జీవాలైన పశువులు, లేగ దూడలు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటిపై కూడా ఇవి దాడులకు తెగబడుతున్నాయి. ఇంత జరుగుతున్నా కుక్కలు, కోతుల నిర్మూలనకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలేమీ లేకపోవడంతో పంచాయతీ అధికారులు సైతం చేతులెత్తేసి ఊరుకుంటున్నారు.

నియోజకవర్గంలో....

మైలవరం నియోజకవర్గంలో కుక్కలు, కోతుల దాడులతో గాయాలపాలైన బాధితులు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు, 65 గ్రామాలు ఉండగా 6 వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కోతులు కూడా వేల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్యశాలలు 10, వెల్నెస్ సెంటర్లు 67 వరకు ఉండగా నెలకు కుక్కలు, కోతుల దాడులతో 100 మందికి పైగా బాధితులు చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా మరికొంత మంది బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు.

వీధుల్లోకి వెళ్లాలంటే భయమేస్తుంది



వెల్లటూరు గ్రామంలో వీధి కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లోకి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తుంది. కోతులైతే ఇళ్లలో దూరి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లిపోతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కొద్దిరోజులు గడిస్తే గ్రామంలో ప్రజల కన్నా కుక్కలు, కోతుల సంఖ్యే అధికంగా ఉంటుంది.

–తిరుమలశెట్టి వీరయ్య, వెల్లటూరు

కుక్కల బాధ తట్టుకోలేకపోతున్నాం



వెలగలేరు గ్రామంలో వీధి కుక్కల మందలు మందలుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా బయటకు రావాలంటే భయమేస్తుంది. చిన్న పిల్లలు వీధుల్లోకి వస్తే దాడులు చేస్తున్నాయి. ప్రాణాలు పోయే వరకు అధికారులు పట్టించుకునేలా లేరు. ప్రభుత్వం సత్వరమే ఏదో ఒక నిర్ణయం తీసుకొని వీధి కుక్కలను నిర్మూలించాలి.

–పెయ్యల ప్రతాప్, వెలగలేరు

నాటు వైద్యాన్ని నమ్మవద్దు



కుక్కలు, కోతులు, కరిచినప్పుడు గాయాలను శుభ్రమైన నీటితో కడగాలి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి వస్తే యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను వేస్తాం. ఈ విధంగా నాలుగు డోసులుగా వ్యాక్సిన్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. గాయాల తీవ్రతను బట్టి వ్యాక్సిన్‌ను అందించి విజయవాడ జీజీహెచ్‌కు పంపుతాము. కుక్కలు, కోతులు కరిచినప్పుడు నాటు వైద్యం చేయించడం వల్ల ప్రాణాపాయం జరిగే అవకాశం కూడా ఉంటుంది.

–డాక్టర్ ప్రసన్నరాణి, మండల వైద్యాధికారి

కాలువలకు మరమ్మతులు చేయాలి

రైతుల డిమాండ్



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని తారకరామ ఎత్తిపోతల పథకం ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు వచ్చేలా కాలువలకు మరమ్మతులు చేయించాలని, ఇటీవల వచ్చిన వరదలకు పడిన గండ్లు పూడ్చించాలని రైతులు డిమాండ్ చేశారు. కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. పలువురు రైతులు మాట్లాడుతూ వీటీపీఎస్ నుంచి నీటిని తారక రామ ఎత్తిపోతల పథకం ద్వారా భూములకు సరఫరా కావడం లేదన్నారు. కాలువలో దట్టంగా పేరుకుపోయిన తూటుకాడ సమస్యగా మారిందని చెప్పారు. తూటుకాడను తొలగించి, గండ్లు పూడ్చాలని కోరారు. ఇటీవల వచ్చిన వరదల్లో మునిగిపోయిన వరి పొలాల రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం అందలేదని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామానికి పరిహారం ఎందుకు రాలేదని, ప్రభుత్వానికి మా గ్రామం గుర్తింపులో లేదా అని పలువురు ప్రశ్నించారు. గందరగోళ పరిస్థితి ఏర్పడటంతో కార్యక్రమం మధ్యలోనే ముగిసింది. వ్యవసాయాధికారి బి.రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రెండో జాబితా రావాల్సి ఉందన్నారు. వరదలకు పొలాల్లోని ఆయిల్ ఇంజిన్లు ముంపునకు గురై పూర్తిగా పాడైపోయాయని, ప్రభుత్వం ఆయిల్ ఇంజిన్లు, వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరారు. అనంతరం పైడూరుపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరదల్లో పంటలు నష్టపోయిన 14 మంది రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందలేదని పలువురు చెప్పారు. బ్యాంక్ లింకేజీ, ఈకేవైసీ వలన రైతులకు పరిహారం అందలేదని వ్యవసాయాధికారి తెలిపారు. గ్రామానికి వచ్చే గద్దె కాలువ, బందగ్ర కాలువలకు గండ్లు పడ్డాయని, వాటిని పూడ్చించాలని రైతులు కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తిరువూరు: రిటైర్డు ఉద్యోగులకు బుధవారం తిరువూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఏపీ రిటైర్డు ఉద్యోగుల సంఘ యూనిట్ అధ్యక్షుడు బల్లిపర విజయప్రసాదరావు తెలిపారు. విజయవాడ మ్యాక్సివిజన్ కంటి ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో రిటైర్డు ఉద్యోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు. తిరువూరులోని బాపూజీ పెన్షనర్స్ హోంలో ఈ వైద్య శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

తిరువూరు: త్వరలో జరుగనున్న శాసన మండలి ఎన్నికలకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని స్థానిక ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రులందరూ కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు దరఖాస్తులు నమోదు చేస్తామని, పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తిరువూరు, గంపలగూడెం మండలాల యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా స్వామి వారికి సమర్పించిన కానుకలను గురువారం ఉదయం 10 గంటలకు లెక్కిస్తారని ఆలయ సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు. గడిచిన నాలుగు నెలల రెండు రోజులకు సంబంధించి భక్తులు హుండీలలో వేసిన కానుకలను లెక్కిస్తారని చెప్పారు.

బంగారు నాణెం అందజేత

చాట్రాయి: చీపురుగూడెం పాల కేంద్రంలో పాలు పోస్తున్న బొట్టు ఝాన్సీ కుమార్తె లక్ష్మీప్రియ వివాహం సందర్భంగా రూ.20 వేలు విలువ చేసే బంగారు నాణేంను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మిల్క్ యూనియన్ జిల్లా పాలక వర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సూక్ష్మ పోషక యాజమాన్యం తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ఎ.కొండూరు: పత్తిలో సమగ్ర సూక్ష్మ పోషక యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ టి. మాధవీలత అన్నారు. కుమ్మరికుంట్ల గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పత్తిలో మెగ్నీషియం లోపమున్నప్పుడు ముదురు ఆకుల అంచుల నుంచి మధ్య భాగం పసుపు రంగుగా మారి ఆకుపచ్చగా ఉంటాయన్నారు. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయని చెప్పారు. ఈలోపం పొటాషియం ఎక్కువగా ఉన్న భూముల్లో కనిపిస్తోందని తెలిపారు. మెగ్నీషియం, జింకు, బోరాన్ లోప లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ఏడీఏ జి.కెనడి, ఏఓ టిప్పుసుల్తాన్, ఏఈఓ ఎ. రామచంద్రరావు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకం వద్దు

చింతలపాడు(తిరువూరురూరల్): వంటలకు కాంప్లెక్స్ ఎరువుల వాడకంతో నష్టం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ టి. మాధవీలత అన్నారు. చింతలపాడు శివారు ఎరుకోపాడులో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించడంతో పాటు సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే సూటి ఎరువుల వాడకంతో పంటలకు సమతుల పోషకాలు అందించవచ్చన్నారు. పంటల్లో మిత్ర పురుగుల గుర్తింపుతో ఎక్కువ పోషకాలను అందించవచ్చని చెప్పారు.

- **నరసాపురం(విస్సన్నపేట):** నరసాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రాజ్యలక్ష్మి వరిపంటను పరిశీలించి నీటియాజమాన్య పద్ధతులు,సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

కార్నియాల సేకరణ



వజ్రాల బ్రహ్మారెడ్డి (ఫైల్)

కనుమూరు(గంపలగూడెం): కనుమూరుకు చెందిన వజ్రాల బ్రహ్మారెడ్డి (60) మంగళవారం ఇంటి వద్ద మృతి చెందారు. నేత్ర దానం ఆవశ్యకతను వివరించి దానం చేయాలని లయన్స్ క్లబ్ సభ్యులు గోగిరెడ్డి కృష్ణారెడ్డి ఆయన కుమారులైన వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రాల ప్రవీణ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలకు వివరించారు. వారు అంగీకరించడంతో తగిన సమాచారం ఇవ్వగా విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు వచ్చి కార్నియాలు సేకరించి తీసుకువెళ్లారు.

శిక్షణతో ఉత్తమ ఫలితాల సాధన



జి. కొండూరులో ర్యాలీ పాల్గొన్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జి.కొండూరు: అభ్యసనా వైకల్యం ఉన్న విద్యార్థులకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని జి.కొండూరు ఎంఈఓలు పీవీ నరసింహారావు, ఎం. వీరాస్వామి అన్నారు. డిస్లెక్సియా అవేర్నెస్ మంత్ కార్యక్రమంలో భాగంగా అభ్యసనా వైకల్యంపై విద్యా శాఖాధికారులు జి.కొండూరులో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ డిస్లెక్సియా అంటే వ్యాధి కాదని, చదవడం, గుర్తుంచుకోవడంలో కొందరికి సమస్య ఉంటుందన్నారు. దీనిని అధిగమించేందుకు వినూత్న పద్ధతిలో ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. ఐఈఆర్టీ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **ఎ.కొండూరు:** మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఎంఈఓ-2 కేశవరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని నిర్మల, ఐఈఆర్‌పీలు శ్రీనివాస్, కె. లక్ష్మణరావు, సీఆర్‌పీ నాగపండు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరం మండల పరిషత్ ప్రాంగణంలోని భవిత సెంటర్‌లో డిస్లెక్సియా విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఐఈఆర్టీ టీచర్ ఎం. కనకదుర్గ ఎంఈఓ బాలు, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రమణక్కపేట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, హైస్కూల్ హెచ్ఎం రామకృష్ణారావు హెచ్ఎం లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** స్థానిక భవిత వనరుల కేంద్రం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ జెడ్పీ హైస్కూల్ నుంచి ఎంఈఓ కార్యాలయం వరకు నిర్వహించారు. ఎంఈఓ సుధాకర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం నిల్వల తనిఖీ

తిరువూరు: నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలులోకి వస్తున్న సందర్భంగా తిరువూరు డివిజన్‌లో మద్యం నిల్వలను ఆర్ఐ మాధురి మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. తిరువూరు సర్కిల్‌లో 16 కొత్త మద్యం దుకాణాలకు అనుమతి లభించింది. పాత నిల్వల పరిశీలనకు లక్ష్మీపురం హోల్‌సేల్ మద్యం దుకాణంతో పాటు పలు దుకాణాల్లో ఆర్డీఓ నిర్వహించిన తనిఖీల్లో తిరువూరు ఎక్సైజ్ సీఐ వీవీవీఎస్ వర్మ, రెవెన్యూ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండల, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో మూలపాడు జెడ్పీ పాఠశాల బాలబాలికలు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఈనెల 1న పటమట జెడ్పీ పాఠశాలలో జరిగిన అండర్ 14 హ్యాండ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో వి.మేఘన ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం డేవిడ్‌రాక్ ఫెల్లర్ మంగళవారం తెలిపారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో తెనాలిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. మైలవరంలో ఈనెల 15న జరిగిన మండల స్థాయి అండర్ 17 బాలుర విభాగం వాలీబాల్ ఈవెంట్‌లో జాన్‌వెస్లీ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి, అండర్ 14 బాలికల విభాగంలో వి.మేఘన, జస్వంతి, బేబీ రాణి, తనిష్కి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సురేంద్రబాబు, వహీదాబేగం, శ్రీనివాసరావులను హెచ్ఎం అభినందించారు.

పల్లెల సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మొర్సుమల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: పల్లెల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మైలవరం మండలం మొర్సుమల్లి, పుల్లూరు, మైలవరం గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మొర్సుమల్లి గ్రామంలో రూ. 32.50 లక్షల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో 722 మీటర్ల పొడవున 4 రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో రహదారుల అభివృద్ధి..

చంద్రగూడెం(మైలవరం): మైలవరం మండలంలో రూ. 5 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 40 రహదారుల నిర్మాణాలు చేపట్టామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. చంద్రగూడెం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.52 లక్షల వ్యయంతో 1,113 మీటర్ల పొడవున 4 రహదారులు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. సమస్య తీవ్రతను బట్టి ప్రజా ప్రయోజనాలు, జనసాంద్రతను దృష్టిలో ఉంచుకుని నిధులను ఆయా ప్రాంతాలకు కేటాయించామని చెప్పారు. పొందుగల పంగిడి చెరువును పరిశీలించి, చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



చింతలనర్వలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలోని 10 గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. పల్లె పండుగలో భాగంగా ఉమ్మడ దేవరపల్లి, నెమలి, కొణిజెర్ల, ఊటుకూరు, దుందిరాలపాడు, తునికిపాడు, పెనుగొలను, చింతలనర్వ, మేడూరు, పెద్దకొమిరలో నిర్మించనున్న 16 రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదార్ల అభివృద్ధికి సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సీహెచ్ రాజేశ్వరరావు, తిరువూరు డీసీ మాజీ చైర్మన్ వై. పుల్లయ్య చౌదరి, నెమలి దేవస్థానం మాజీ చైర్మన్ బెల్లం మధు, టీడీపీ అధ్యక్షులు ఆర్. వీరారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి పార్థసారథి



అక్కిరెడ్డిగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో రూ.82.25 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న 16 పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్కిరెడ్డిగూడెంలో రూ. 15.50 లక్షలతో ఐదు సీసీ రోడ్లు, సూరేపల్లిలో రూ. 16 లక్షలతో మూడు సీసీ రోడ్లు, లోపూడిలో రూ.21 లక్షలతో ఒక సీసీ రోడ్డుకు, చెక్కపల్లిలో రూ.29.75 లక్షలతో ఏడు సీసీ రోడ్లకు, మొత్తం రూ.82.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని ఈ నెల 20 వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపీపీ కొండా దుర్గాభవానీ, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, సర్పంచ్‌లు లక్ష్మి, సుధారాణి, రాధిక, తహసీల్దార్ పురుషోత్తమశర్మ, ఎంపీడీఓ జి.రాణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళి



మైలవరం ఎంపీపీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న గోపాల్, విద్యార్థులు

మైలవరం: భారతదేశ మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం స్థానిక ఎంపీపీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం గోపాల్ మాట్లాడుతూ అణుశక్తి రంగంలో మిస్సైల్ మేన్‌గా కలాం ప్రసిద్ధి చెందారని, రక్షణ రంగంలో భారత దేశాన్ని అగ్ర భాగాన నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భారత దేశం ఆయనను భారత రత్న అవార్డుతో సత్కరించిందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని స్థానిక శ్రీనిధి స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం చేసిన సేవలను పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట నారాయణ విద్యార్థులకు వివరించారు. సాదాసీదాగా జీవించిన అబ్దుల్ కలాం చివరి రోజుల్లో తనకంటూ ఆస్తిపాస్తులు మిగుల్చుకోకుండా పేదలకు దానధర్మాలు చేశారన్నారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.
- **గంపలగూడెం:** మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. పెనుగొలనుకు చెందిన షిర్డీ సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో గోసవీడు అంగన్‌వాడీ కేంద్రంలో, పెనుగొలను ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలను వివరించారు. గోసవీడు పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం తినేందుకు అవసరమైన స్టీలు గిన్నెలు, గ్లాసులను పంపిణీ చేశారు. ప్రగతి విద్యాలయం కరస్పాండెంట్ వెదురు వెంకటరెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు డిపో దసరా ఆదాయం రూ. 16.58 లక్షలు

నూజివీడు: ఆర్టీసీకి దసరా పండుగ ఆదాయాన్ని తెచ్చి పెట్టింది. దసరా ఉత్సవాలకు నూజివీడు ఆంధ్రా మైసూర్‌గా ఖ్యాతి గడించిన నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ డీఎం సీహెచ్ సూర్యపవన్ కుమార్ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. ఈ నెల 7 నుంచి 12 వరకు హైదరాబాద్ నుంచి నూజివీడుకు అదనంగా నాలుగు సర్వీసులను, ఈ నెల 13, 14 తేదీల్లో నూజివీడు నుంచి హైదరాబాద్‌కు అదనంగా ఐదు సర్వీసులను, దసరా సెలవులకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులను వారి వారి సొంత గ్రామాలకు వెళ్లేందుకు అనువుగా బస్సులను నడిపారు. దీంతో నూజివీడు డిపోకు రూ.16.58 లక్షల ఆదాయం లభించింది. మొత్తం 6,313 మంది ప్రయాణించగా, కిలోమీటరుకు రూ.43.44లను ఆర్జించింది. ఈ ఆదాయం బుధవారం వరకు కొనసాగే అవకాశం ఉంది.